సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శనివారం । 30 । సెప్టెంబర్ । 2023



సోమశిలలో నీటి నిల్వ

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో శుక్రవారం సాయంత్రానికి 27.126 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 9,422 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు) -	రూ.59,710
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా) -	5,380
3 శాతం జీఎస్టీతో.. -	రూ.5,541
నవర (8 గ్రా) -	రూ.44,328

వాతావరణం

గరిష్టం/కనిష్టం
37.0 /26.0

శుక్రవారం గాలిలో తేమ 76 శాతం ఉంది. జిల్లాలో పలుచోట్ల వర్షం కురిసింది. శనివారం కూడా పలు ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది.

న్యూస్‌రీల్

నేడు ఏపీ శాసనసభ స్పీకర్ తమ్మినేని రాక



నెల్లూరు(దర్గామిట్ట): ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం శనివారం నెల్లూరు నగరానికి రానున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి వెంకటనారాయణమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వెళుతున్న ఆయన శనివారం మధ్యాహ్నం 2 గంటలకు నెల్లూరు ఆర్‌అండ్‌బీ అతిథిగృహానికి చేరుకుని మరలా 2.30 గంటలకు బయలుదేరి వెళతారని తెలిపారు.

స్త్రీనిధి రికవరీలపై ప్రత్యేక దృష్టి

- డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి

నెల్లూరు(పొగతోట): స్త్రీనిధి రికవరీల విషయంలో మండల సమాఖ్య అధ్యక్షులు ప్రత్యేక దృష్టి సారించాలని డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి సూచించారు. శుక్రవారం నెల్లూరులోని డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో మండల సమాఖ్య అధ్యక్షులతో నిర్వహించిన సమావేశంలో పీడీ మాట్లాడారు. స్త్రీనిధి రికవరీల విషయంలో పొదలకూరు, కలువాయి తదితర మండలాలు వెనుకబడి ఉన్నాయన్నారు. ఈ విషయంలో జాప్యం చేస్తే స్త్రీనిధి రుణాలు ఉన్నతి, రుణాలు మంజూరు చేయడం సాధ్యం కాదన్నారు. మండల సమాఖ్య సమావేశాలు ప్రతినెలా క్రమం తప్పకుండా నిర్వహించాలని తెలిపారు. సమావేశంలో సమాఖ్యకు సంబంధించిన ఐదుగురు సభ్యులు హాజరుకావాలని, తీసుకున్న రుణాలు వసూలు చేసేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. అంతకు ముందు విజయవాడ నుంచి ప్రత్యేక సీఎస్ రాజశేఖర్ స్త్రీనిధి రుణాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమావేశంలో స్త్రీనిధి ఏజీఎం కామాక్షయ్య, మండల సమాఖ్య అధ్యక్షులు పాల్గొన్నారు.

'ఏక్ తారీక్ ఏక్ గంట శ్రమదాన్' జయప్రదం చేద్దాం

నెల్లూరు(పొగతోట): దేశవ్యాప్తంగా ప్రారంభమవుతున్న స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 'ఏక్ తారీక్ ఏక్ గంట శ్రమదాన్' ఇందుకూరుపేట మండలంలోని మైపాడు గ్రామంలో అక్టోబర్ 1వ తేదీన 10 గంటలకు ప్రారంభమవుతుందని డీపీఓ సుస్మితారెడ్డి శుక్రవారం తెలిపారు. మైపాడు గ్రామ పంచాయతీలో ఉదయం 9 గంటలకు ర్యాలీగా బయలుదేరి మైపాడు సముద్రతీరంలో ప్లాస్టిక్ వ్యర్థాలను శుభ్రపరిచేలా ఒక గంటసేపు జిల్లాస్థాయి ఉన్నతాధికారులు, గ్రామ పంచాయతీ పరిధిలోని నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పారిశుద్ధ్య కార్మికులు, ప్రజలు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్, జెడ్పీ సీఈఓ, డీపీఓ, జిల్లాస్థాయి ఉన్నతాధికారులు, మండలస్థాయి అధికారులు పాల్గొంటారని తెలిపారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలందరూ భాగస్వాములై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని మహాత్మునికి ఇచ్చే సరైన నివాళి ఈ కార్యక్రమం అని పేర్కొన్నారు.


హోంగార్డు నియామక పత్రాల అందజేత



పద్మావతికి హోంగార్డు నియామకపత్రాన్ని అందజేస్తున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్): విధి నిర్వహణలో మృతిచెందిన నలుగురు హోంగార్డు కుటుంబ సభ్యులు హోంగార్డు ఉద్యోగాలను పొందారు. షేక్ అమీర్ బాషా సంగంలో విధులు నిర్వహిస్తూ మృతిచెందగా ఆయన కుమారుడు షేక్ మహబూబ్‌బాషాకు, ఎం.వెంకయ్య నవాబుపేటలో విధులు నిర్వహిస్తూ మృతిచెందగా ఆయన సతీమణి ఎం.పద్మావతికి, ఆర్.శ్రీనివాసులు బిట్రగుంటలో విధులు నిర్వహిస్తూ మృతిచెందగా ఆయన కుమారుడు ప్రసన్నకుమార్‌కు, వి.మునిస్వామి సూళ్లూరుపేటలో పనిచేస్తూ మృతిచెందగా ఆయన కుమారుడు వి.రాజీవ్‌కు కారుణ్య నియామకం కింద ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి హోంగార్డు ఉద్యోగాలు కల్పించారు. శుక్రవారం తన చాంబర్‌లో వారికి నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ డి.హిమవతి, హోంగార్డ్సు డీఎస్పీ ఎస్.చంద్రమోహన్, ఆర్‌ఐ రమణారెడ్డి, సూపరింటెండెంట్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి శోయగాలు.. కనువిందు చేసే జలపాతాలు.. ప్రాచీన ఆలయాలు, శిల్పకళకు అద్దంపట్టే దేవాలయాలు, తిరుమల గిరులను పోలిన పర్వత శ్రేణులు.. అడుగడుగునా కనిపించే అలనాటి రాజమందిరాలు.. ఇలా ఎన్నెన్నో విశిష్టతలతో నిండిన ప్రాంతాలు పర్యాటక శోభితం కానున్నాయి. అవే ఉదయగిరి నియోజకవర్గంలోని సిద్దేశ్వరం, దుర్గంపల్లి ప్రాంతాలు. వీటిని అటవీశాఖ ఎకో టూరిజం స్పాట్లుగా తీర్చిదిద్దేందుకు సిద్ధమైంది. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు కూడా పంపింది.



దుర్గం.. పర్యాటక శోభితం

- ఎకో టూరిజం స్పాట్లుగా సిద్దేశ్వరం, దుర్గంపల్లి
- ఐదు దశాబ్దాల ఆశలకు కార్యరూపం
- రూ.5.56 కోట్లతో వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు
- దుర్గంపైకి రోప్ వే నిర్మాణానికి పరిశీలన

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జిల్లాలో ఉదయగిరి దుర్గానికి ఎంతో చారిత్రక ప్రాధాన్యం ఉంది. చోళులు, పల్లవులు, రెడ్డిరాజులు, గజపతులు, విజయనగర రాజులు, గోల్కొండ నవాబులు, రాయలు ఏలిన ఈ ప్రాంతంలో ఒకప్పుడు రతనాలు రాసులు పోసి అమ్మారని ప్రతీతి. రెండు శతాబ్దాలకు పూర్వం వరకు కూడా మహోన్నతంగా ఒక వెలుగు వెలిగిన ఉదయగిరి ప్రాంతం అనంతరం తన ప్రాభవాన్ని కోల్పోయింది. అలనాటి రాచరిక పాలనకు గుర్తులుగా మొండి గోడలు, శిథిల రాజభవనాలు నేటికీ ఈ ప్రాంతంలో దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం జిల్లా కేంద్రానికి వంద కి.మీ. దూరంలో నీటి ఆధారం లేని మెట్టప్రాంతంగా ఉదయగిరి అభివృద్ధికి దూరంగా ఉండిపోయింది. త్వరలో ఈ ప్రాంతం పర్యాటక శోభతో పరిఢవిల్లనుంది.

చారిత్రక కట్టడాలకు ప్రసిద్ధి

ఉదయగిరిని 1512లో శ్రీకృష్ణ దేవరాయలు పరిపాలించారు. గజపతులు ఉదయగిరి ప్రాంతంలో దేవాలయాలు, కోనేరులు నిర్మించారు. శ్రీకృష్ణ దేవరాయలు నిర్మించిన ఆలయాలు, నవాబులు నిర్మించిన మసీదులు, రాణీ మందిరాలు, ధాన్యాగారాలు, గుర్రపు శాలలు, ఫిరంగి కోటలు, కోనేర్లు, సొరంగమార్గం నేటికీ ఉన్నాయి. ఉదయగిరి దుర్గం కింద పట్టణంలో తల్పగిరి రంగనాయకులస్వామి దేవాలయం, కృష్ణాలయం, కల్యాణమండపం నేటికీ దర్శనమిస్తున్నాయి. ఉదయగిరి నుంచి బండకిందపల్లికి వెళ్లే ఘాట్‌రోడ్డులో పాదచారుల కోసం రాయిలో తవ్విన బావి తానాబావిగా ప్రసిద్ధి. అనంతరం బ్రిటీష్ పాలనలో స్టేట్ దొర నిర్మించిన ప్రార్థనా మందిరం, తహసీల్దార్ కార్యాలయ భవన సముదాయాలు చెక్కుచెదరకుండా ఉన్నాయి.

తొలి సూర్యకిరణాలు పడే గిరి

సముద్ర మట్టానికి 755 అడుగుల ఎత్తులో ఉదయగిరి కోట ఉంది. ఈ కోటపై 20 డిగ్రీల ఉష్ణోగ్రత మాత్రమే ఉంటుంది. ఉదయగిరి కోట 5 కి.మీ. వ్యాసార్థంతో తిరుమల కొండను పోలి ఉంది. పచ్చిక బయళ్లతో, వన్యప్రాణులతో ప్రకృతి సౌందర్యం విరాజిల్లుతూ ఉంటుంది. ఉదయించే సూర్యుడి తొలి కిరణాలు ఈ కొండ(గిరి)పైనే పడతాయి. విజయనగర సామ్రాజ్యంలో సూర్యకిరణాలు ఒక్క కొండ కోటపైనే ముందుగా పడుతుండడంతో దీనికి ఉదయగిరిగా నామకరణం చేశారని పెద్దలు చెబుతుంటారు. ఇంతటి చారిత్రాత్మక నేపథ్యం గల ఉదయగిరి దుర్గాన్ని శ్రీకృష్ణదేవరాయలు 18 నెలలుగా ఇక్కడే మకాంవేసి పాలన సాగించారని చారిత్రక ఆధారాల ద్వారా తెలుస్తోంది.

అభివృద్ధిని మరిచిన గత పాలకులు

ఉదయగిరి ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి చెందితే ఎంతో మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభించే అవకాశం ఉంది. దీనిపై గత ఐదు దశాబ్దాలుగా ప్రతిపాదనలు ఉన్నాయి. ఉదయగిరి ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని చెప్పిన గత పాలకులు ఆచరణలో విఫలమయ్యారు. ఎన్నికల వేళ హామీలు గుప్పించిన పార్టీలు అధికారం చేపట్టగానే ఇచ్చిన హామీలు మరిచిపోయాయి. దీంతో పర్యాటకంగా ఈ ప్రాంత అభివృద్ధి కలగానే మిగిలిపోయింది.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు

ఎంతో ప్రాశస్త్యం ఉన్న సిద్దేశ్వరం, దుర్గంపల్లి ప్రాంతాలను టూరిజం స్పాట్లుగా అభివృద్ధి చేసేందుకు, ఆ రెండు ప్రాంతాల్లో పర్యాటకులకు వసతులు కల్పించేందుకు అటవీశాఖ ప్రణాళికలు సిద్ధం చేసింది. పార్కులు, తాగునీటి వసతులు, రిఫ్రెష్ గదులు, గార్డెన్స్, జిమ్‌లు, ఫిట్‌నెస్ సెంటర్లు, యోగా కేంద్రాలు, ప్రకృతిని వీక్షించేందుకు వాచ్ టవర్లు, సోలార్ షెడ్స్, లైట్లు ఇలా.. 45 రకాల పనులకు ఒక్కొక్క ప్రాంతంలో వసతులు కల్పించేందుకు రూ.2.78. కోట్ల వంతున అంచనాలతో ప్రభుత్వానికి అధికారులు ప్రతిపాదనలు పంపారు.

చూడదగిన ప్రదేశాలు

ఉదయగిరికి 33 కి.మీ. దూరంలో అత్యంత ప్రాచీనమైన, అతి శక్తివంతమైన శైవక్షేత్రం ఘటిక సిద్దేశ్వరం ఉంది. సిద్ధేశ్వరానికి అతి సమీపంలో ఉన్న బూసానాయుడు కోటను కూడా అభివృద్ధి చేయవచ్చు. సిద్దేశ్వరం నుంచి మరో 30 కి.మీ. దూరంలో పల్లవులు అద్భుత శిల్పకళా నైపుణ్యంతో ఒకే రాతిలో చెక్కిన దేవాలయం, ద్వారపాలకులు, శివలింగాల నందీశ్వరుడు కొలువైన భైరవకోన ఉంది. ఇక్కడి జలపాతాలు పర్యాటకులను ఎంతగానో ఆకర్షిస్తాయి. అక్కడి నుంచి మరో 24 కి.మీ. ముందుకు వెళితే నారాయణస్వామి ఆలయం, మరో 10 కి.మీ. దూరంలో హనుముని కొండ, మరో 25 కి.మీ. దూరంలో వెంగమాంబ ఆలయాన్ని సందర్శించవచ్చు.



ఉదయగిరిలోని పురాతన కోనేరు (ఫైల్)

పర్యాటక అభివృద్ధికి ప్రతిపాదనలు

ఉదయగిరి దుర్గాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ఇప్పటికే సుమారు రూ.5 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాం. త్వరలో నిధులు మంజూరైన వెంటనే అభివృద్ధి పనులు ప్రారంభిస్తాం. రాయలు ఏలిన నేల కావడంతో పర్యాటకంగా అభివృద్ధి చేయాల్సిన అవశ్యకత ఉంది.

– చంద్రశేఖర్, డీఎఫ్‌ఓ, నెల్లూరు

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన మేకపాటి

ఉదయగిరి ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న సమయంలో కేంద్రం నుంచి కూడా మరికొంత నిధులు మంజూరు చేయించి అభివృద్ధికి దోహదపడాలని వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఇటీవల కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఉదయగిరి దుర్గానికి వెళ్లేందుకు రోప్ వేతో పాటు ఉదయగిరిలో ఉన్న ప్రాచీన దేవాలయాలను జీవనోద్ధరణ చేసేలా ప్రతిపాదనలు అందజేశారు.

సోమిరెడ్డివి బూటకపు మాటలు



వీఎస్‌యూలో నూతనంగా నిర్మించిన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ భవనం వద్ద మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తదితరులు

- స్కిల్ డెవలప్‌మెంట్‌లో చంద్రబాబు దోపిడీ వాస్తవం
- చిల్లర రాజకీయాలు చేస్తున్న టీడీపీ
- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం: 'స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో చంద్రబాబు దోపిడీ వాస్తవం. అన్ని ఆధారాలు ఉండడంతోనే చంద్రబాబు జైలు పాలయ్యారు. కానీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి బూటకపు మాటలతో విక్రమ సింహపురి యూనివర్సిటీలో సీమెన్స్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ అంటూ ఫేక్ ప్రచారం చేస్తున్నారు..' అని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ధ్వజమెత్తారు. వీఎస్‌యూలో సీమెన్స్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఉందంటూ ఈ నెల 27వ తేదీన సోమిరెడ్డి జిల్లాలోని టీడీపీ నాయకులతో కలిసి వీఎస్‌యూను సందర్శించి ఫేక్ ప్రచారం చేసి వెళ్లారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం మంత్రి కాకాణి వీఎస్‌యూను సందర్శించి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌తోపాటు వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక నిర్మించిన స్కిల్ డెవలప్‌మెంట్ నూతన భవనాన్ని పరిశీలించారు. వీఎస్‌యూలో ఉన్న స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ సీమెన్స్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ కాదని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిర్మించిందని ఆధారాలతో చూపారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌తో సంబంధం లేకుండా డబ్బులు కాజేయాలనే దురుద్దేశంతోనే ప్రత్యేకంగా సీమెన్స్ పేరిట చంద్రబాబు దోపిడీకి పాల్పడ్డారని పేర్కొన్నారు. చంద్రబాబు దోచుకున్న స్కిల్ కుంభకోణానికి సంబంధించి జిల్లాలో నెల్లూరు పాలిటెక్నిక్ కళాశాల, గూడూరులోని ఆదిశంకర ఇంజినీరింగ్ కాలేజీల్లో మాత్రమే సీమెన్స్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వం జీఓఎంఎస్ నంబర్.5 ద్వారా ఉత్తర్వులు ఇచ్చినట్లు తెలిపారు. సోమిరెడ్డిలాంటి పచ్చి అబద్ధాల కోరు మాటలు విని టీడీపీ నాయకులు వీఎస్‌యూకు వచ్చి అభాసుపాలయ్యారని పేర్కొన్నారు.

అన్నివర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి
- 16,515 మంది వాహనమిత్ర లబ్ధిదారులకు రూ.16,51,60,000 మెగా నమూనా చెక్ అందజేత



వైఎస్సార్ వాహనమిత్ర లబ్ధిదారులకు మెగా నమూనా చెక్ అందజేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): అన్నివర్గాల ప్రజల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు వైఎస్సార్ వాహనమిత్ర పథకం 5వ విడత జిల్లాలో 16,516 మంది లబ్ధిదారులకు రూ.10 వేల చొప్పున మొత్తం రూ.16,51,60,000 ఆర్థికసాయం అందజేస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. వైఎస్సార్ వాహనమిత్ర పథకం ఐదో విడత ఆర్థికసాయం లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసే కార్యక్రమాన్ని శుక్రవారం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విజయవాడ విద్యాధరపురం నుంచి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కలెక్టర్ ఎం.హరినారాయణన్, డీటీసీ చందర్, డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, ఆర్టీఓ సుధాకర్ రెడ్డి, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, వైఎస్సార్ వాహనమిత్ర లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు. వైఎస్సార్ వాహనమిత్ర పథకానికి సంబంధించి జిల్లాలో 16,516 మంది లబ్ధిదారులకు రూ.16,51,60,000 మెగా చెక్కును కలెక్టర్‌తో కలిసి మంత్రి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి విలేకరులతో మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజల సంక్షేమానికి కృషి చేస్తున్నారని తెలిపారు. చిన్నచిన్న వాహనాల యజమానులకు ప్రభుత్వపరంగా చేయూతనందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ వాహనమిత్ర పథకాన్ని ప్రవేశపెట్టి ప్రతి సంవత్సరం రూ.10 వేల చొప్పున ఆర్థికసాయం అందజేస్తున్నట్లు తెలిపారు. వాహనాలకు చిన్నపాటి మరమ్మతులు వచ్చినా, ఇన్సూరెన్స్ కట్టాల్సి వచ్చినా, ఫిట్‌నెస్ తెచ్చుకోవాలన్నా అదనంగా నగదు అవసరం అవుతుందని, ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం అందించే ఆర్థికసాయం ఉపయోగపడుతుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 2,75,931 మంది వైఎస్సార్ వాహనమిత్ర పథకం లబ్ధిదారులకు రూ.276 కోట్లు ముఖ్యమంత్రి జమ చేశారని తెలిపారు. లబ్ధిదారుల వారీగా రాష్ట్రంలో విశాఖపట్నం జిల్లా మొదటిస్థానంలో ఉండగా, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా రెండో స్థానంలో ఉందని తెలిపారు.

ముఖ్యమంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు



నేను ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాను. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నా కుటుంబానికి ఇంటి స్థలం మంజూరు చేశారు. మా అమ్మకు పింఛన్ అందిస్తున్నారు. వైఎస్సార్ వాహనమిత్ర పథకం ద్వారా రూ.10 వేల చొప్పున ఆర్థికసాయం అందిస్తూ ఆదుకుంటున్నారు. ముఖ్యమంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు.

– ఎస్‌డీ గౌస్‌బాషా, దామరమడుగు, బుచ్చిరెడ్డిపాళెం

ఇచ్చిన మాట ప్రకారం అందజేస్తున్నారు



పాదయాత్రలో భాగంగా ఆటో డ్రైవర్ల కష్టాలను చూసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే వాహనదారుల కోసం వైఎస్సార్ వాహనమిత్ర పథకాన్ని అమలు చేస్తున్నారు. ఏటా రూ.10 వేలు అందజేసి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. గత ప్రభుత్వాలు ఏనాడూ ఆటో డ్రైవర్ల సంక్షేమాన్ని గురించి ఆలోచించలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆటోడ్రైవర్లంతా రుణపడి ఉంటాం.

– మెరుగుమాల వీరబాబు, బుచ్చిరెడ్డిపాళెం

విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం ప్రాధాన్యం

- ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారని నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. రూరల్ నియోజకవర్గ పరిధిలోని 35వ డివిజన్ సారాయిఅంగడి సెంటర్ ప్రాంతంలో శుక్రవారం పలు అభివృద్ధి పనులకు ఎంపీ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఇప్పటి వరకు 35వ డివిజన్‌లో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. మరో రూ.50 లక్షల మంజూరుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. రూరల్ నియోజకవర్గ అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. పలు ప్రాంతాల్లో కోట్లాది రూపాయిల నిధులతో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. ప్రజలకు అవసరమైన చోట నిధుల కేటాయింపు చేస్తామన్నారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమన్నారు. కుల,మత, రాజకీయాలకు అతీతంగా రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ప్రభుత్వానికి ప్రజలకు మధ్యన వారధిలా వ్యవహరిస్తూ పారదర్శకంగా ప్రజలకు ఇంటి వద్దే సేవలు అందిస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నూరుశాతం నేరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దేనన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ప్రజలు ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేయర్ స్రవంతి, విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, స్థానిక కార్పొరేటర్ వాసంతి, పలువురు కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ, నగర పాలక సిబ్బంది పాల్గొన్నారు.

బతికున్నా.. చనిపోయారంటూ..

- ఓటర్ల జాబితాలో పేర్లు తొలగించాలి అంటూ ఆన్‌లైన్‌లో దరఖాస్తులు
- విస్తుపోతున్న ఓటర్లు



పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న బాధితురాలు దేవరాల సమరా

నెల్లూరు(వీఆర్సీసెంటర్): బతికున్న వారిని సైతం చనిపోయినట్లుగా పేర్కొంటూ వారి ఓట్లను తొలగించాలని కార్పొరేషన్ అధికారులకు కొందరు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు పంపుతున్నారు. అయితే ఈ తొలగింపు జాబితాలో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల పేర్లు ఉండడం చూస్తుంటే టీడీపీ వర్గాలే ఇలా దరఖాస్తు చేస్తున్నట్లు అనుమానిస్తున్నారు. నగరంలోని 54వ డివిజన్ జనార్దనరెడ్డి కాలనీలోని బర్మాషెల్‌గుంట ప్రాంతానికి చెందిన దేవరాల సమరా (తండ్రి దేవరాల శివరామకృష్ణ) నివాసం ఉంటోంది. ఈమెకు పోలింగ్ బూత్ నం.10లో ఓటు హక్కు ఉంది. అయితే దేవరాల సమరా మృతిచెందిందని ఆమె ఓటును తొలగించాలని ఫాం-7 కింద దరఖాస్తు అందింది. అలాగే ఇదే డివిజన్‌కు చెందిన గౌస్‌బాషాకు పోలింగ్‌బూత్ 10లో ఓటు హక్కు ఉంది. ఎస్‌కే మస్తాన్, పెల్లగిరి దేవదానం 9వ నంబర్ పోలింగ్ బూత్‌లో ఓటు హక్కు కలిగి ఉన్నారు. వీరందరూ జీవించి ఉండనేగా మృతిచెందారని, వారి పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించాలని కార్పొరేషన్ అధికారులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు అందాయి. అయితే వీరందరూ వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు కావడం గమనార్హం. పక్కా ప్రణాళిక ప్రకారం టీడీపీ నాయకులే తప్పుడు సమాచారంతో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఓటర్లు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన దేవరాల సమరా తాను బతికే ఉన్నా చనిపోయినట్లుగా ఫాం-7 సమర్పించిన వారిపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం కార్పొరేషన్ అధికారులకు, నవాబుపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

క్లుప్తంగా

ప్రజారోగ్యం ప్రభుత్వ బాధ్యత

నెల్లూరు (దర్గామిట్ట): ప్రజారోగ్యం ప్రభుత్వ బాధ్యతని కలెక్టర్ ఎం.హరినారాయణన్ పేర్కొన్నారు. శుక్రవారం మధ్యాహ్నం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ లక్ష్యాన్ని వివరించారు ఈ కార్యక్రమానికి కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణం నుంచి కలెక్టర్‌తో పాటు ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి, ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 30 నుంచి అక్టోబర్ 31వ తేదీ వరకు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, డీపీఓ సుస్మిత, డీసీహెచ్‌ఎస్ రమేష్‌నాథ్, ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్టు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మాలకొండ ఆదాయం రూ.63,91,705

వలేటివారిపాళెం: మాలకొండలో కొలువైన శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఆరు వారాల హుండీ లెక్కింపు ద్వారా రూ.63,91,705 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ కేబీ శ్రీనివాసరావు తెలిపారు. అలాగే బంగారం 268 గ్రాములు, వెండి 715 గ్రాములతో పాటు వివిధ దేశాల కరెన్సీ నగదును భక్తులు కానుకలుగా సమర్పించారని వివరించారు. శుక్రవారం హుండీ కానుకల లెక్కింపును వై భైరాగి సమక్షంలో నిర్వహించారు.

రాజకీయ కక్షపూరిత కేసుల కొట్టివేత

కోవూరు: 9 ఏళ్ల క్రితం టీడీపీ ప్రభుత్వ హయాంలో వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యేతో పాటు జిల్లా అధ్యక్షుడిపై పెట్టిన రాజకీయ కక్షపూరిత కేసుల ను విజయవాడ కోర్టు శుక్రవారం కొట్టి వేసింది. 2014లో కావలి నియోజకవర్గంలోని సమస్యలపై జాతీయ రహదారిపై చేపట్టిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, అప్పటి ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న ప్రస్తుత కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిపై టీడీపీ ప్రభుత్వం రాజకీయ కక్షపూరితంగా కేసులు నమోదు చేసింది. ఈ కేసులో సాక్షాలు లేని కారణంగా విజయవాడ కోర్టు కొట్టివేసినట్లు ఎమ్మెల్యే ప్రసన్న తెలిపారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 122
లేయర్ (లైవ్)	: 118
బ్రాయిలర్ చికెన్	: 214
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 240
లేయర్ చికెన్	: 200



రాయలోరు నడయాడిన ఊళ్లు

- పల్లకి మోసి తరించిన బోయిలచిరివెళ్ల
- పాలనా వ్యవహారాలకు సాక్షీభూతం కచ్చేరిదేవరాయపల్లి
- చరిత్ర మిగిల్చిన ఆనవాళ్లు

సాక్షి, నెల్లూరు డెస్క్: విజయనగర సామ్రాజ్యాన్ని పాలించిన మహారాజు శ్రీకృష్ణదేవరాయలు. ఆయన హయాంలో ప్రజలు సుఖశాంతులతో ఉండేవారని, ఆర్థికంగా సుసంపన్నంగా ఉండేవారని చరిత్ర చెబుతోంది. కృష్ణదేవరాయలు పలువురు రాజులను ఓడించి తన సామ్రాజ్యాన్ని దశదిశలా విస్తరించారు. ఉదయగిరి ప్రాంతం కూడా ఆయన ఏలుబడిలోకి వచ్చిన తరువాత ఈ ప్రాంతంలో అనేక దేవాలయాలను కట్టించారు. ఉదయగిరి కోటను పటిష్టపరిచారు. సామంతరాజులను నియమించుకుని పాలన సాగించేవారు. ఆయన ఏడాదికి రెండుమూడు పర్యాయాలు ఆత్మకూరు మీదుగా ఉదయగిరి వైపు వచ్చేవారని పాతతరం పెద్దలు చెబుతుండేవారట. రాయలవారు వచ్చినపుడు ఆయన పల్లకి మోసే బోయీలకు కొంత భూమిని ఇనాంగా ఇచ్చారని ఆ ప్రాంతమే నేడు బోయిలచిరివెళ్లగా మారిందని చారిత్రక ఆధారంగా తెలుస్తోంది. ఆనాటి విజయనగరం (నేడు కర్ణాటకలోని హంపి) నుంచి ఉదయగిరి చేరేందుకు తూర్పు దిశగా పయనించి పెన్నా తీరంలోని ఓ చోట చెట్టుకింద కూర్చుని సేదదీరి పాలనా వ్యవహారాలపై కచేరీ నిర్వహించేవారని అదే నేడు కచేరీదేవరాయపల్లిగా మారిందని నానుడి.



బోయిలచిరివెళ్ల

శ్రీకృష్ణదేవరాయలు తన సామ్రాజ్య పరిధి ఎక్కువగా ఉండడంతో సామంతరాజుల ద్వారా పరిపాలన సాగించేవారు. ఆయా రాజ్య ప్రాంతాలను ఆయన తరచూ సందర్శించి ప్రజలతో మాట్లాడుతుండేవారట. ఆ రోజుల్లో గుర్రాలపైనే పర్యటనలు సాగేవి. అలా దక్షిణ ప్రాంతం నుంచి వస్తూ పెన్నానదిని దాటి ఆత్మకూరు చేరుకునే వారని పెద్దలు చెబుతుండేవారు. ఆత్మకూరు నుంచి ఉదయగిరి వైపు ఆయన మందీమార్బలంతో సాగుతుండేవారని, ఈ మార్గంలో ఆయన ఏడాదికి రెండు లేదా మూడుసార్లు పర్యటించేవారని చారిత్రక ఆధారాలను బట్టి తెలుస్తోంది. ఆత్మకూరు నుంచి ఉదయగిరి వెళ్లే మార్గంలో వాగులు, వంకలు ఉన్నచోట గుర్రాలపై వెళ్లడం కూడా సాధ్యపడేది కాదని, ఆ సమయంలో రాయల వారిని, ఇతర ముఖ్యులను బోయీలు పల్లకిలో మోసుకెళ్లేవారు. ఆ మార్గంలో పెన్నానది ఉపనది భగేరు (బొగ్గేరు) దాటేందుకు బోయీల సాయం తీసుకునే వారట. ఇలా పల్లకి మోసే బోయీలకు కృష్ణదేవరాయలు చిరివెళ్ల వద్ద కొంత భూమిని ఇనాంగా ఇచ్చి సాగుచేసుకోమన్నారట. ఆ భూమిని సాగుచేసుకుంటూ అక్కడే బోయీ కుటుంబాలు నివాసం ఏర్పరచుకోవడంతో కాలక్రమేణా ఆది బోయిలచిరివెళ్ల గ్రామంగా మారిందని ఇప్పటికీ చెప్పుకుంటారు.


బోయిలచిరివెళ్ల గ్రామం వ్యూ

రాయలవారు బోయీలకు భూములిచ్చారు



మా ప్రాంతాన్ని అప్పట్లో శ్రీకృష్ణదేవరాయలు ఏలారని మా పూర్వీకులు చెబుతుండేవారు. ఎన్నో బోయీల కుటుంబాలకు రాయలవారు భూమిని ఇచ్చారు. దాన్ని సాగు చేసుకుని బతికే కుటుంబాలు గ్రామంలో గతంలో చాలా ఉండేవి. కాలక్రమేణా చాలామంది గ్రామం విడిచి వెళ్లారు. నా చిన్న వయసులో కూడా కొన్ని బోయీల కుటుంబాలు ఉండేవి. ప్రస్తుతం గ్రామంలో బోయీలు పెద్దగా లేకున్నా ఊరు పేరు మాత్రం బోయిలచిరివెళ్లగానే స్థిరపడింది.

– మంతు వెంకట సుబ్బారెడ్డి, బోయిలచిరివెళ్ల, ఆత్మకూరు మండలం


కచ్చేరిదేవరాయపల్లి గ్రామం వ్యూ

కచ్చేరిదేవరాయపల్లి

శ్రీకృష్ణదేవరాయలు విజయనగరం నుంచి వస్తూ పెన్నా నదిని దాటి ఉదయగిరి వెళ్లే క్రమంలో ఓ చోట కచ్చేరి (పాలనా వ్యవహారాలపై స్థానిక పెద్దలతో చర్చలు) నిర్వహించేవారట. కాలక్రమంలో ఆ ప్రాంతంలో కొందరు నివాసాలు ఏర్పరచుకున్నారట. రాయలు పేరు వచ్చేలా ఆ ఊరికి దేవరాయపల్లిగా నామకరణం చేసుకున్నారని స్థానిక పెద్దలు చెబుతుండేవారట. ఉదయగిరికి రాయల వారు రాకపోకలు సాగించే ప్రతిసారి కచ్చేరి నిర్వహిస్తుండేవారు. ఇలా కొన్నాళ్లు గడిచాక ఆ గ్రామాన్ని కచ్చేరి దేవరాయపల్లిగా పిలిచే వారట. తర్వాత ఆ గ్రామానికి అదే పేరు స్థిరపడిపోయింది. ప్రస్తుతం ఈ గ్రామం అనంతసాగరం మండలంలో ఉంది. బ్రిటిష్ వారి పాలనలోనూ కొంత కాలం కచ్చేరిదేవరాయపల్లి నుంచే పరిపాలన సాగించారని ఆ తరానికి చెందిన పెద్దలు చెబుతుంటారు. కాల క్రమేణా పరిపాలన ఆత్మకూరుకు మారడంతో బ్రిటిష్ హయాంలో ఆత్మకూరు తాలుకా కేంద్రమైంది. మద్రాస్ సెంట్రల్ లైబ్రరీలోని సింహపురి చరిత్ర అనే గ్రంథంలో ఈ వివరాలు నమోదై ఉన్నట్లు చరిత్రకారుల ద్వారా తెలుస్తోంది. అప్పట్లో రాయలవారు పెన్నానది ఒడ్డున ఉన్న కచ్చేరిదేవరాయపల్లిలో పలు ఆలయాలు నిర్మించారు.

మా గ్రామంలో కచ్చేరి నిర్వహించేవారట



కృష్ణదేవరాయల కాలంలో మా గ్రామంలో కచ్చేరి నిర్వహించేవారని మా పెద్దలు చెబుతుండేవారు. పరిపాలన వ్యవహారాలు అన్నీ కచ్చేరి ద్వారానే జరిగేవట. బ్రిటిష్ పాలనలోనూ గ్రామంలో కొంత కాలం కచ్చేరి కొనసాగినా తరువాత ఆత్మకూరుకు మార్చారట. గ్రామంలో రాయలవారి కాలంలో పలు ఆలయాలు కూడా నిర్మించారట. కానీ వాటిలో కొన్ని శిథిలమయ్యాయి.

– వీ మహదేవయ్య, పూజారి, కచ్చేరిదేవరాయపల్లి, అనంతసాగరం మండలం

శాశ్వతమైన అభివృద్ధి పనులు చేపడుతున్నాం


రీటైనింగ్ వాల్‌ను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

- నగర ఎమ్మెల్యే పీ అనిల్‌కుమార్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): గత టీడీపీ ప్రభుత్వంలో మాదిరిగా హడావుడి పనులు చేపట్టకుండా తమ ప్రభుత్వంలో శాశ్వతమైన అభివృద్ధి పనులు చేపడుతున్నామని నగర ఎమ్మెల్యే పీ అనిల్‌కుమార్ పేర్కొన్నారు. నగరంలోని 54వ డివిజన్ భగత్‌సింగ్ కాలనీ వద్ద పెన్నానది ఒడ్డున జరుగుతున్న రీటైనింగ్ వాల్ నిర్మాణ పనులను శుక్రవారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్‌కుమార్ మాట్లాడుతూ వెంకటేశ్వరపురం, జనార్దన్‌రెడ్డి కాలనీ, భగత్‌సింగ్‌కాలనీ, ఇస్లాంపేట ప్రాంతాలు పెన్నాకు వరద వచ్చినప్పుడు ముంపునకు గురవుతున్నాయన్నారు. ఈ సమస్య పరిష్కారానికి పెన్నానది ఒడ్డున 40 అడుగుల ఎత్తున రీటైనింగ్ వాల్ నిర్మాణ పనులు చేపడుతున్నామని తెలిపారు. ఈ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. ఇటీవల ఈ ప్రాంతానికి వచ్చిన ప్రతిపక్ష నాయకులు ఎన్నికల హడావుడి మాత్రమేనని, రీటైనింగ్ వాల్ నిర్మాణ పనులు జరగడం లేదని ఆరోపించారన్నారు. వారందరూ ఈ ప్రాంతానికి వచ్చి పనులు జరగుతున్నాయా..లేదా అని పరిశీలిస్తే వారికే అర్థమవుతుందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో మాదిరిగా హడావుడి పనులు కాకుండా తమ ప్రభుత్వంలో ఫ్లడ్ బ్యాంక్‌లు, కొత్త పెన్నా బ్రిడ్జి నిర్మాణం వంటి శాశ్వతమైన అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. కోవిడ్ సమయంలో కూడా పనులు చేసి పెన్నా బ్యారేజీని ప్రారంభించామన్నారు. గత ప్రభుత్వం ఐదేళ్ల పాటు ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టకుండా కాలయాపన చేసి ఎన్నికలకు ఆరు నెలల ముందు హడావుడిగా నాసి రకంగా పనులు చేపట్టి అభివృద్ధి చేశామని గొప్పలు చెప్పుకుంటున్నారన్నారు. ఏ రోజైనా అభివృద్ధి విషయంలో తాను చర్చకు సిద్ధమని సవాల్ చేసినా ప్రతిపక్షాలు స్వీకరించకుండా మీడియా ముందు ఏదోకటి మాట్లాడి వెళ్తున్నాయన్నారు. నగర నియోజకవర్గ అభివృద్ధిని ఒక అజెండాగా తీసుకుని ముందుకెళ్తున్నామన్నారు. స్కిల్ స్కాంలో మాజీ సీఎం చంద్రబాబునాయుడు అడ్డంగా దొరికితే కొందరు ధర్నాలు, ర్యాలీలు చేస్తున్నారని, వారు ఏ నాడైన ప్రజాసమస్యలపై ధర్నాలు చేశారా అని ప్రశ్నిస్తున్నామన్నారు. దోపిడీలు, అవినీతిని కప్పిపుచ్చుకునేందుకే తప్ప, ప్రజల కోసం ఏ రోజూ ధర్నాలు చేసిన దాఖలాలు లేవన్నారు. ఎమ్మెల్యే వెంట కార్పొరేటర్లు షేక్ సఫియా బేగం, దేవరకొండ సుజాత, కార్పొరేషన్ కోఆప్షన్ సభ్యుడు షేక్ జమీర్, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పనిచేయాలి

- ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): ఆత్మకూరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా ప్రజాప్రతినిధులు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పనిచేయాలని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన నెల్లూరులోని తన క్యాంపు కార్యాలయంలో ఆత్మకూరు నియోజకవర్గంలోని అన్ని మండలాల పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో పార్టీ విజయానికి ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని సూచించారు. ఎందుకు ఆంధ్రాకు జగన్ కావాలి అనే నినాదంతో ప్రజలందరితో మమేకం కావాలని సూచించారు. అక్టోబర్ 9న మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. 11వ తేదీ నియోజకవర్గ స్థాయిలో కార్యక్రమాన్ని ప్రారంభించాల్సి ఉంటుందన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అందజేసిన సంక్షేమ పథకాల బోర్డులు, పార్టీ జెండాలను ఆవిష్కరించాలన్నారు. అందుకు సంబంధించి పార్టీ మండల కన్వీనర్‌తో పాటు ప్రజాప్రతినిధులు, నాయకులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన ప్రతిఒక్కరూ ఈ కార్యక్రమాలకు హాజరయ్యేలా చూడాలన్నారు. సచివాలయ కన్వీనర్ల నేతృత్వంలో గృహసారథులు ఇంటింటి ప్రచార కార్యక్రమాలను నూరు శాతం నిర్వహించేలా చూడాలన్నారు. వైఎస్ జగన్ మళ్లీ సీఎం కావాలనే లక్ష్యంతో అందరం సమష్టిగా పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు

3,4న క్రీడా అకాడమీల్లో ప్రవేశానికి ఎంపికలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): రాష్ట్రస్థాయి క్రీడా అకాడమీల్లో ప్రవేశానికి గానూ నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో అక్టోబర్ 3, 4 తేదీల్లో క్రీడాకారుల ఎంపికలు నిర్వహించనున్నట్లు సెట్నల్, డీఎస్‌ఏ ముఖ్యకార్యనిర్వహణాధికారి వీ నాగరాజకుమారి శుక్రవారం తెలిపారు. రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ, వైఎస్సార్ జిల్లా, పులివెందులోని ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో ఐదు క్రీడాంశాల్లో ఎంపికలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అక్టోబర్ 3న ఉదయం 9 గంటలకు వాలీబాల్, బాస్కెట్ బాల్, హాకీ, 4న ఉదయం 9 గంటలకు బ్యాడ్మింటన్, టెన్నిస్ పోటీలు ఉంటాయని చెప్పారు. 12 నుంచి 18 ఏళ్లలోపు వారు అర్హులని తెలిపారు. వివరాలకు 88862 28444 నంబరులో సంప్రదించాలని కోరారు.

నిమ్మధరలు పొదలకూరు (కిలో)



పెద్దవి	: రూ. 70
సన్నవి	: రూ. 30
పండ్లు	: రూ. 8